ఈ చోరశిఖామణి ఎవరబ్బా?

- రూ.3 లక్షల నగదు చోరీ కేసు
- చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు
- నలుగురితో ప్రత్యేక బృందం ఏర్పాటు



సీసీ పుటేజీలో రికార్డు అయిన దృశ్యం

సత్తెనపల్లి: పట్టణంలో ఓ ద్విచక్ర వాహనం నుంచి నగదు చోరీ చేసిన కేసును పోలీసులు చాలెంజ్‌గా తీసుకున్నారు. స్థానిక మాచర్లరోడ్‌లో గల పెద్ద మసీదు ఎదురు తిరుమల ఫెర్టిలైజర్స్‌లో ఎరువులు కొనుగోలు చేసేందుకు కందులవారి పాలెం గ్రామానికి చెందిన రైతు బూతుకూరు శ్రీనివాసరెడ్డి మంగళవారం వెళ్లారు. ఎరువుల దుకాణం ముందు ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. ఆ వాహనంలో బ్యాంక్ నుంచి డ్రా చేసిన రూ. 3 లక్షల నగదు గుర్తు తెలియని దుండగుడు అపహరించుకు పోయిన విషయం తెలిసిందే. బ్యాంకు నుంచి శ్రీనివాసరెడ్డి నగదు డ్రా చేసుకొని తన స్నేహితుడు రమేష్ తో కలిసి ఎరువులు కొట్టు దగ్గరికి వచ్చి ఎరువులు కొనుగోలు చేస్తున్న సమయంలో దుండగుడు సెల్ ఫోన్‌లో ఎవరితో మాట్లాడినట్లు యాక్షన్ చేస్తూ ఒకసారి ద్విచక్ర వాహనం కవర్ పైకి తిసి మళ్లీ అటూ ఇటూ చూసి ద్విచక్ర వాహనంలోని నగదు కవర్ తీసుకొని వెళ్లిన వ్యవహారం అంతా సీసీటీవీ పుటేజ్ లో రికార్డు అయింది. అయితే కర్ణాటక బోర్డర్ ప్రాంతంలోని ఓజుకుప్పం చెందిన దొంగగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఓజు కుప్పం దొంగ అయితే బ్యాంక్ దగ్గర కాపుకాసి రైతు వెంట వెళ్లి చోరీ చేసే అవకాశం ఉంటుందా? సహజంగా ఆ ప్రాంతానికి చెందిన దొంగ అయితే చైన్‌స్నాచింగ్, ఇండ్లలో దొంగతనాలు చేసే అవకాశం ఉంటుందని కొందరు భావిస్తున్నారు. ఏది ఏమైనా ఈ కేసును త్వరితగతిన చేధించేందుకు సత్తెనపల్లి సీఐ నరహరి నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఒక ఎస్ఐ, ఇద్దరు హెడ్, ఒక కానిస్టేబుళ్లతో కూడిన నలుగురు బృందాన్ని నియమించారు. ఈ బృందం తమదైన శైలిలో చోరీకి పాల్పడిన దొంగను గుర్తించేందుకు ముమ్మరంగా యత్నిస్తున్నారు.

క్లుప్తంగా

న్యాయవాదుల కోవిడ్ రుణాలు మాఫీ చేయాలి

సత్తెనపల్లి: కోవిడ్ సమయంలో న్యాయవాదులకులోన్ ద్వారా గత రాష్ట్ర ప్రభుత్వం అందించిన రూ.10 వేలు, రూ. 20 వేలు ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సత్తెనపల్లి భార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నరిశేటి వేణుగోపాల్ బుధవారం కోరారు. కోవిడ్ సమయంలో గత రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి అనేక మంది న్యాయవాదులకు లోన్ గా ఆర్థిక సహాయాన్ని అందించిందన్నారు. కోవిడ్ కారణంగా ఉపాధి కోల్పోయిన న్యాయవాదులు లోన్ పొంది లబ్ధిదారులుగా ఉన్నారన్నారు. నేటికీ అనేక మంది న్యాయవాదులు తమ ఆర్థిక పరిస్థితి మెరుగు పడ నందున లోను మొత్తం తిరిగి చెల్లించలేకపోయారన్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు ఏపీ బార్ కౌన్సిల్ సంయుక్తంగా కోవిడ్ లోన్ రుణమాఫీ చేసేందుకు తగు చర్యలు తీసుకొని న్యాయవాదులకు ఊరట కలిగించాలని ఆయన కోరారు.

బాలాజీనగర్ తండాలో ప్రతిష్టా మహోత్సవాలు



నకరికల్లు: మండలంలోని బాలాజీనగర్‌తండాలో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టామహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తండావాసులు, భక్తుల సహకారంతో కారంపూడి-నకరికల్లు రహదారిలో బాలాజీనగర్ తండాకు వెళ్లే రోడ్డుపై అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజాదికాల్లో పాల్గొన్నారు. సత్తెనపల్లి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రమావత్ శ్రీనునాయక్, లాలూ నాయక్, కొర్రా కృష్ణ, జగనానాయక్, పాశం పాపిరెడ్డి, చట్టు సైదులు, తండా వాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తాం



నకరికల్లు: బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో తనవంతు సహకారం అందిస్తానని తహసీల్దార్ కె.పుల్లారావు అన్నారు. పెదకొదమగుండ్ల గ్రామంలో విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యానికి గురై వైకల్యం పొంది న్యాయం కోసం మండలంలోని చేజర్ల గ్రామంలో 26 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న సాగర్‌బాబు కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేజర్ల గ్రామంలో దీక్ష చేస్తున్న సాగర్ బాబు కుటుంబాన్ని పరామర్శించి వివరాలు తెలుసుకున్నామన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే విధంగా సంబంధిత అధికారులకు సిఫారసు చేస్తామన్నారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సమయస్ఫూర్తితో క్రీడల్లో రాణించాలి



నకరికల్లు: క్రీడాకారులు సమయస్ఫూర్తితో రాణించాలని ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు సూచించారు. స్థానిక వంగా వెంకటరెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడాపోటీలు, సెలక్షన్సను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ జి.ఝాన్సీరాణి మాట్లాడుతూ అండర్-14, అండర్-17 బాలబాలికలకు ఖో-ఖో, వాలీబాల్, చెస్, యోగా, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు నిర్వహించి మండలస్థాయి జట్లను ఎంపిక చేశామన్నారు. మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెలక్షన్స్‌లో ఎంపికైన క్రీడాకారులు డివిజన్‌స్థాయి పోటీల్లో ఆయా మండలాల తరపున పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పలువురు క్రీడా ఉపాధ్యాయులు, పలు మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు.

వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

సత్తెనపల్లి: స్థానిక అచ్చంపేటరోడ్‌లో గల నిర్మలానగర్‌కు చెందిన ఓ మహిళకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తి అసభ్యకర ఫోటోలు, మెసేజ్‌లు పెట్టి వేధిస్తున్న వ్యక్తిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నిర్మలానగర్ కు చెందిన మహిళ ఇన్‌స్టాగ్రామ్‌లో రీలు పెట్టడంతో షేక్.ఫరూక్ పేరుతో ఇన్‌స్టాగామ్ అకౌంట్ కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ఆరీల్‌ను సేవ్ చేసుకొని ఆమెకు అసభ్యకరమైన ఫోటోలు, మెసేజ్ లు పెట్టి వేధించడంతో ఆమె మనస్తాపం చెంది పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఐటీ యాక్ట్ కింద పట్టణ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

ఫ్లోరోసిస్ వ్యాధిని గుర్తించాలి



రాజుపాలెం: మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని రెడ్డిగూడెంలో గల ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులకు ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాల గురించి జిల్లా కన్సెల్టెంట్ ఎన్‌సీడీ డాక్టర్ గిరిధర్‌కుమార్ అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరిధర్ మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వ్యాధి భూగర్భ జలాలు, ఆహార పదార్థాలు, టీ, కాఫీ,టూత్ పేస్టులలో ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ వ్యాధి వలన పిల్లల దంతాలు పసుపురంగులోకి మారడం, కీళ్ల నొప్పులు రావడం జరుగుతుందని చెప్పారు. పాఠశాలలోని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జోత్స్న, ఉపాధ్యాయులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



రాజుపాలెం: బాల్య వివాహాలను ప్రోత్సహించే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీవో కార్యాలయ బాలల సంరక్షణ సహాయకులు జయరాం తెలిపారు. మండలంలోని చౌటపాపాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల తల్లిదండ్రులకు బాల్య వివాహాలపైన, పౌష్టికాహారంపై అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ పిల్లలు కలగని దంపతులకు ప్రభుత్వం నుంచి చిన్న పిల్లలను దత్తత తీసుకోవచ్చని తెలిపారు. అలాంటి దంపతులు ఉంటే ముందుగా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వడం వలన పుష్టిగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తూకాల మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



రాజుపాలెం: తూకాలలో మాయచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి తూకాల కొలతల శాఖ ఇన్స్పెక్టర్ ఎస్‌కె జాన్‌సైదా షాపు యజమానులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని కిరాణా షాపులను, కూల్ డ్రింక్ షాపులలోని తూకాలను బుధవారం పరిశీలించారు. అదేవిధంగా గ్రామాల్లో తిరుగుతూ రైతుల వద్ద పత్తి కొనుగోలు చేసే వారి ఎలక్ట్రిక్ తూకాన్ని పరిశీలించగా 2 కేజీలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని రైతులు గమనించి పత్తిని గాని, మిరపను గాని అమ్ముకోవాలని తెలిపారు. ఇలాంటి వారి పట్ల రైతులు అపరమత్తంగా ఉండాలని సూచించారు.

సమయస్ఫూర్తితో క్రీడల్లో రాణించాలి

నకరికల్లు: క్రీడాకారులు సమయస్ఫూర్తితో రాణించాలని ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు సూచించారు. స్థానిక వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడాపోటీలు, సెలక్షన్సను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ జి.ఝాన్సీరాణి మాట్లాడుతూ అండర్-14, అండర్-17 బాలబాలికలకు ఖో-ఖో, వాలీబాల్, చెస్,యోగా, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు నిర్వహించి మండలస్థాయి జట్లను ఎంపిక చేశామన్నారు. మండలస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెలక్షన్స్‌లో ఎంపికై న క్రీడాకారులు డివిజన్‌స్థాయి పోటీల్లో ఆయా మండలాల తరపున పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో క్రీడా ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, బి.చినబాబు, గౌస్, సుహాసిని, చినబాబు, శివపార్వతీ, అశ్విని, పలు మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు.

తలుపులు వేసిన గృహంలో చోరీ

సత్తెనపల్లి: తలుపులు వేసిన గృహంలో చోరీ జరిగిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నందిగామ డొంకరోడ్డులో నివసిస్తున్న గుండాల మరియమ్మ గేదెల కాపరిగా పనిచేస్తూ జీవనం వెళ్లదీస్తుంది. ఇంటికి తలుపులు వేసి గేదెల వద్దకు ఆమె వెళ్లగా గుర్తు తెలియని దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి 50 తులాల వెండి ఆభరణాలు, రూ. 10 వేలు నగదు అపహరించుకు పోయాడు.దీంతో మరియమ్మ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

అగ్రిమెంట్ లేని వైట్‌బర్లీకి ప్రభుత్వ బాధ్యత లేదు

నకరికల్లు: బ్లాక్‌బర్లీ పొగాకు సాగుపై ప్రభుత్వం నిషేధం విధించిందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. నల్లబర్లీ పొగాకు సాగును నియంత్రించేందుకు మండలంలోని చాగల్లు గ్రామంలోని రైతులకు బుధవారం అవగాహనాసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 నుంచి బ్లాక్‌బర్లీ పొగాకును నిషేధించడం వల్ల సాగు చేయడం, కొనుగోళ్లు, అమ్మకాలు చేయడం చట్టవ్యతిరేకమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.పుల్లారావు, డిప్యూటి తహసీల్దార్ కొండారెడ్డి, ఆర్ఐ సిద్దయ్య, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావు, అభ్యుదయరైతు చల్లా వెంకట్రావు, విఆర్వో టి.పీరా, ఎంపీఓ జె.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత కళ్ళంను విచారించిన పోలీసులు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం మాజీ నియోజకవర్గ అధ్యక్షుడు కళ్ళం విజయ భాస్కర్‌రెడ్డిని బుధవారం సత్తెనపల్లిరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ షేక్ అమినుద్దీన్ విచారించారు. ఆగస్టు 28న సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలోని 33/11 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న నలుగురిని ఎలాంటి నోటీసు ఇవ్వకుండా అదే నెల 21న మౌఖిక ఆదేశాలతో తొలగించడంతో షిఫ్ట్ ఆపరేటర్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తాళాలు వేసి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. వారికి వైఎస్సార్ సీపీ సంఘీభావం తెలిపింది. దీనిలో భాగంగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట జరిగిన ఆందోళనకు జనాన్ని ఎందుకు పోగు చేశారని విజయభాస్కర్ రెడ్డిని ఎస్ఐ అమినుద్దీన్ ప్రశ్నించారు. షిఫ్ట్ ఆపరేటర్లు తమ సంఘీభావం కోరారని, దానిలో భాగం గానే తాము అక్కడికి చేరుకొని వారికి సంఘీభావం తెలిపామన్నారు. అనంతరం ఆయనతో సంతకాలు తీసుకొని మరోసారి విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని చెప్పి పంపారు.

అనారోగ్యంతో మండల కో ఆప్షన్ మెంబర్ మృతి



రాజుపాలెం: మండలంలోని మొక్కపాడు గ్రామానికి చెందిన మండల కో-ఆప్షన్ మెంబర్ ఎస్‌కె మహబూబ్ సుభాని (ఆర్టీసీ కండక్టర్) అనారోగ్య కారణంగా బుధవారం మృతి చెందారు. దీనికి గాను సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త గజ్జెల సుధీర్‌భార్గవ్‌రెడ్డి సుభాని భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, ఎంపీపీ తెలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, ఎంపీటీసీ బీబీ హుస్సేన్, జిల్లా కార్యదర్శి ఎస్‌కె భాషా, మాజీ సర్పంచ్ పశ్యావుల కోటేశ్వరరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ సీతారాములు, మండల యూత్ కన్వీనర్ బత్తుల శివయ్య, మైనార్టీ సెల్ కన్వీనర్ సుభాని,సోషల్ మీడియా కన్వీనర్ జానీ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో మండల స్థాయి ఆటలపోటీలు ప్రారంభం

క్రోసూరు: క్రోసూరు జెడ్పీపాఠశాల ఆటస్థలం నందు బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి పాఠశాల బాలబాలికలకు ఆటల పోటీలు ప్రారంభమైనట్లు పాఠశాల హెచ్ ఎం దుగ్గిబాబూరావు తెలిపారు. ఆటలపోటీలను ఎంఈఓలు జి.కృష్ణ, ఎం.గణేష్‌లు ప్రారంభించారు. మండలంలోని అన్ని పాఠశాల నుంచి విద్యార్థులు ఆటల పోటీలకు పాల్గొంటునట్లు హెచ్ఎం వివరించారు. తొలిరోజు ఖోఖో, కబ్బాడీ ,వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీల కు కేజీబీవీ పీడీ శ్రీలక్ష్మీ,నాగవరం పీడీ కె.రామయ్య,బయ్యవరం పీడీ ఆరోగ్యం పర్యవేక్షించినట్లు తెలిపారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

నకరికల్లు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధికల్పనా సంస్థ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్స్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితశిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జాబ్స్ రిసోర్స్‌పర్సన్ శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్ కోర్సును 3నెలలపాటు ఉచిత వసతితో కూడిన శిక్షణనిచ్చి మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తారన్నారు. సంస్థల నిబంధనల ప్రకారం జీతంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉంటుందన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివి పాస్ లేదా ఫెయిల్ అయిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కంప్యూటర్ బేసిక్స్, కంప్యూటర్ టైపింగ్‌స్పీడ్, ఎంఎస్‌వర్డ్, ఎక్సెల్, పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్, కమ్యూనిషన్ అండ్ సాఫ్ట్ స్కిల్స్, జాబ్స్ స్కిల్స్ నేర్పిస్తామన్నారు. 18 ఏళ్ల నుంచి 27 ఏళ్లలోపు వయస్సు కలిగిన యువతీ యువతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు స్కిల్ కాలేజ్, డీఆర్‌డీఏ ట్రైనింగ్ సెంటర్, రెడ్డసత్రం ఎదురుగా, కోటప్పకొండ, సెల్: 9908482907 నంబరును సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు

సత్తెనపల్లి: వేగంగా ద్విచక్ర వాహనం నడిపి తండ్రి, కుమార్తెను గాయపరిచిన గుర్తు తెలియని వ్యక్తిపై సత్తెనపల్లిరూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి నుంచి కనగాల స్వామి, ఆయన కుమార్తె ప్రశాంతి ఈ నెల 6న ద్విచక్రవాహనంపై గుంటూరు వెళుతుండగా సత్తెనపల్లి మండలం కంటేపూడి సమీపంలోని నలంద ఇంజనీరింగ్ కళాశాల వద్ద గుంటూరు నుంచి సత్తెనపల్లి ద్విచక్ర వాహనంపై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో కనగాల స్వామి, ఆయన కుమార్తె ప్రశాంతిలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిరువురిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. కనగాల స్వామి ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని ద్విచక్ర వాహనదారుడిపై సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు వద్ద బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామానికి చెందిన కారసాని ప్రమోద్ సత్తెనపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై కంటెపూడి వెళుతుండగా నందిగామ అడ్డరోడ్డు వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో గుంటూరు నుంచి సత్తెనపల్లి వస్తున్న విద్యుత్ శాఖకు చెందిన బొల్లేరో వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో ప్రమోదుకు తీవ్ర గాయాలు కావడంతో హుటా హుటిన సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మల్లేశ్వరి

అమరావతి: విశాఖపట్నంలో జరగనున్న, సీఐటీయూ 18వ ఆల్‌ఇండియా మహాసభలు జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షురాలు జి.మల్లేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ అమరావతి మండల జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి సీఐటీయూ కార్యదర్శి బి.సూరిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ 1974లో చారిత్రకమైన రైల్వే పోరాటం నుంచి నేటికీ కొనసాగుతున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేకపోరాటం వరకు సీఐటీయూ నిబద్ధతతో కార్మిక హక్కుల కోసం పోరాడుతుందన్నారు. నూటయాభై సంవత్సరాల కిందట ఎనిమిది గంటలో పని దినం సాధించుకుంటే నేడు పాలక ప్రభుత్వాలు 13 గంటలు పనిచేయాలని కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయటం దారుణమన్నారు. రాష్ట్రంలో కార్మికులను శ్రమ దోపిడీకి బానిస తత్వానికి ప్రోత్సహిస్తుందని ఇది మంచి విధానం కాదన్నారు మండలంలోని కార్మిక వర్గం వచ్చే డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే ఆల్ ఇండియా మహాసభలో జయప్రదానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్మికుల సంఘ సభ్యులు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొన్నారు

సెపక్‌తక్రా జిల్లాస్థాయి బాల,బాలికల జట్ల ఎంపిక



సెపక్‌తక్రా జిల్లా జట్లకు ఎంపికైన బాలికలు, ప్రాబల్స్ బాలుర జట్లతో శివరామకృష్ణ, పీఈటీలు

సత్తెనపల్లి: సెపక్ తక్రా పల్నాడు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాల, బాలికల సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు బుధవారం నిర్వహించారు. బాలుర జట్టు ప్రాబల్స్ తీసి గురు, శుక్ర వారం క్యాంప్‌లు నిర్వహించనున్నారు. ఈ క్యాంపులో జట్టును ఫైనలైజ్ చేయనున్నారు. బాలికల జట్టును బుధవారం ఫైనల్ చేశారు. ఈ జట్టు ఈనెల 11,12 తేదీల్లో చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ సెపక్ తక్రా ఛాంపియన్షిప్ లో పాల్గొంటుందని సెపక్ తక్రా పల్నాడు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి పి శివ రామకృష్ణ తెలిపారు. 11 మంది జూనియర్ బాలుర ప్రాబల్స్ జట్టులో నందిగామ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన డి.జాన్సన్, ఎం.మనోహర్, ఆర్.సంతోష్ కుమార్, కె శామ్యూల్ రాజు, కె.చిరంజీవి, 70 తాళ్లూరు ఎస్‌వీవీఎస్‌కు చెందిన కె.శ్రీనాథ్, పీ.మబీన్, సత్తెనపల్లి విద్యా కేంద్రం జూనియర్ కళాశాలకు చెందిన వై ప్రభుదాసు, నరసరావుపేట వాసవి కళాశాలకు చెందిన షేక్ నాగ నజీర్, కె ముఖేష్, సత్తెనపల్లి ప్రగతి జూనియర్ కళాశాలకు చెందిన పి విజయ్‌కుమార్‌లు ఉన్నారు. బాలికల జట్టుకు నందిగామ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఓ దీవెన, డి స్వరూప, ఆర్ లీలా ప్రసన్న, గుడిపూడి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన బి మాధవి, జి గాయత్రి, ఎం భార్గవి లు ఎంపికయ్యారు. కార్యక్రమంలో నందిగామ, గుడిపూడి, పెదమెక్కెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు గందు సాంబశివరావు, కె కిరణ్ కుమార్, బి అనిల్ దత్త నాయక్, కోచ్‌లు చిరంజీవి, రవి, శివ లు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఛాంప్స్ హెచ్ఎం భార్గవి

సత్తెనపల్లి: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భాష్యం సంస్థల జోనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (జెడ్ఈఓ) ఎం.హృదయరాజ్ అన్నారు. పట్టణంలోని భాష్యం పాఠశాలలో భాష్యం ఒలంపస్ ప్రోగ్రాం బుధవారం వైభవంగా ప్రారంభించారు. పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి విద్యార్థినీ, విద్యార్థులు క్రీడాజ్యోతిని వెలిగించి పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా హృదయరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మేధావులు తరగతి గదిలో తయారైతే, దేశ ఖ్యాతిని పెంచే ప్రతిభావంతులు క్రీడా మైదానంలో మాత్రమే పుడతార న్నారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎం.వెంకట్రావు మాట్లాడుతూ భాష్యం ఒలంపస్ ప్రోగ్రాం ఆగస్టు 15 నుండి జనవరి 26 వరకు జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఈ నెల 8 నుంచి 31 వరకు విద్యార్థినీ, విద్యార్థులకు బ్రాంచ్‌లెవెల్, జోన్‌లెవెల్, సెంట్రల్‌లెవెల్ ఇలా మూడు విభాగాలుగా విద్యార్థులను తీసుకొని ప్రతిభావంతులైనటువంటి క్రీడాకారు లకు బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఛాంప్స్ ప్రధానోపాధ్యాయురాలు వి.భార్గవి, పీఈటీ డి రాజేష్, తరుణ్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్టోబర్ 25 వరకు ఈ క్రాప్ నమోదుకు గడుపు పెంపు

అచ్చంపేట: మండలంలో ఈ క్రాప్ నమోదుకు అక్టోబరు 25వరకు గడుపు పెంచినట్లు ఏవో పి.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. అచ్చంపేట మండలంలో 22వేల ఎకరాలలో సాగు విస్తీర్ణం ఉండగా 19,250 ఎకరాలలో రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నట్లు చెప్పారు. అందులో 11,350 ఎకరాలలో పత్తి, 5500 ఎకరాలలో మిర్చి, 850 ఎకరాలలో వరి, 600 ఎకరాలలో మొక్కజొన్న పంటలు వేయిగా మిగిలిన భూమిలో మినుము, కంది, పండ్ల తోటలు వేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 17వేల ఎకరాల పంటలను తమ సిబ్బంది ఈ క్రాప్ నమోదు చేశారన్నారు. పంట నమోదు చేయించుకోవలసిన రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రానికి వెళ్లి నమోదు చేయించుకోవాలని సూచించారు.పంటలకు అనువుగాని భూములు, ఖాళీగా ఉన్న భూములను కూడా ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కి సాగు చేయని భూములుగా పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. పంట నమోదు చేయించుకోవడం వల్ల ప్రభుత్వం వారి రాయితీలకు అర్హత పొందుతారన్నారు. రైతులు పండించిన పంటలు ప్రభుత్వం కొనుగోలు చేయాలంటే పంటనమోదు తప్పని సరిగా చేయించి ఉండాలన్నారు. ప్రకృతి వైపరిత్యాలకు పంట నష్టం జరిగితే పరిహారం పొందాలన్నా పంటనమోదు ప్రక్రియ ముఖ్యమన్నారు. కౌలు దారులకు రుణ అర్హత పత్రాలను కూడా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అవసరమైన రైతులు వీఆర్వో, సమీ రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలన్నారు.

మునక పొలాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

పెదకూరపాడు: అధిక వర్షాలతో వాగులు పొంగి పంట నష్టంతో అన్నదాతలు పడుతున్న అవస్థలను వర్ష బీభత్సం శీర్షికన సాక్షి దినపత్రికల్లో బుధవారం ప్రచురితమైన కథనానికి పెదకూరపాడు మండల వ్యవసాయ అధికారి కష్ణయ్య స్పందించారు. తన సిబ్బందితో కలిసి బుధవారం వర్ష ప్రభావిత ప్రాంతాలైన పెదకూరపాడు పాటిబండ్ల, జలాల్పురం గ్రామాల్లో పర్యటించి నష్టం వాటిల్లిన పొలాలను పరిశీలించారు. అధిక వర్షం వలన వచ్చిన వర్షం నీరు పొంగడంతో వాగులు, కాల్వలు ప్రక్కన ఉన్న పంట పొలాలు తాత్కాలికంగా నీటిలో మునిగి నీరు తీసిన పిదప ప్రస్తుతం పంట ఆర్థిక నష్టం ఉన్నట్లుగా గమనించడమైనది. అక్కడక్కడ పల్లం ప్రాంతాలలో నిల్వ ఉన్న నీటిని బయటికీ పంపి యూరియా 30 కేజీలు, పొటాష్ 15 కేజీలు ఎకరాకు చొప్పున ఎదజల్లు కోవలసిందిగా రైతు సోదరులకు సూచించడమైనది. పత్తిలో ఆకు మచ్చ బాక్టీరియా తెగుళ్ళు వృద్ధి చెంద కుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 600గ్రాములు, స్ప్రెప్టోసైక్లిన్ 20గ్రాములు ఎకరాకు చొప్పున పైపాటుగా పిచికారి చేసుకోవాలని సూచించారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

సత్తెనపల్లి: పొలానికి నీటి విషయంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగిన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒప్పందం ప్రకారం పొలానికి నీరు పెట్టుకునే విషయంలో ఇరువర్గాల అన్నదమ్ముల మధ్య తేడాలు రావడంతో వివాదం చాలా రేగింది. దీంతో దాడులకు దిగడంతో ఇరువర్గాల తలలు పగిలి గాయాలయ్యాయి. లక్కిపోగు ఆనంద్ బాబు, లక్కిపోగు అనేషుల వేర్వేరు కొంటర్ల ఫిర్యాదు మేరకు వీరు ఇరువురితో పాటు మరో ఆరుగురి పై సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ షేక్ అమీనుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖతార్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ద్వారా ఖతార్‌లోని దోహాలో రిజిస్టర్డ్ నర్సుల (రిజిస్టర్డ్ నర్సు-హోంకేర్ నర్సు) ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్యాధికారి తమ్మాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు తెలుపుతూ రిజిస్టర్డ్ నర్సు (ఖతర్), ప్రదేశం దోహ,విద్యార్హతలు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ ఎంనర్సింగ్ ఉండాలన్నారు. వయస్సు 21 నుంచి 40 సంవత్సరాలు, స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. రెండు సంవత్సరాల అనుభం ,పోస్ట్ రిజిస్ట్రేషన్, వేతనం నెలకు సుమారు రూ.1.20 లక్షల పైన, పనిగంటలు రోజుకు 12 గంటలు, వారానికి ఆరురోజులు ఉంటుందన్నారు.ఈ నెల 13వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు.రిజిస్ట్రేషన్ లింక్‌కు httpr:// naipunyam.ap.gov.in/urerrefirtrationpafepsoframrefirtration ఆసక్తిగల అభ్యర్థులు తమ రెజ్యూమ్‌ను మైయిల్‌ఐడీకి పంపించవచ్చునన్నారు. (Qerume) Email Id: rkiinternationa @aprrdc.in మరిన్ని వివరాలకు (Command Contso): 9988853335, 8712655686, 8790118349, 8790117279. సంప్రదించవచ్చునన్నారు.